## 14

# దేవుని న్యాయము

అన్యజనులకు: "దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలు పరచబడుచున్నది. ఎందుకనగా దేవుని గూర్చి తెలియ శక్యమైనదేదో అది వారి మధ్య విశదమైయున్నది; దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు. మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధకారమయమాయెను ... . ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగా ఎరిగియుండియు, వాటిని చేయుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించువారితో సంతోషముగా సమ్మతించుచున్నారు" (రోమా 1:18-32).

"ధర్మశాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేసినయెడల వారు ధర్మశాస్త్రము లేనివారైనను, తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు. అట్టివారి మనస్సాక్షి కూడ సాక్ష్యమిచ్చుచుండగను, వారి తలంపులు ఒక దానిమీద ఒకటి తప్పు మోపుచు లేక తప్పులేదని చెప్పుచుండగను ధర్మశాస్త్రము తమ హృదయములయందు వ్రాయబడినట్టు చూపుచున్నారు" (రోమా 2:14, 15).

యూదులకు: "కాబట్టి తీర్పు తీర్చు మనుష్యుడా, నీవెవడవైనను సరే నిరుత్తరుడవై యున్నావు. దేనివిషయములో ఎదుటివానికి తీర్పు తీర్చుచున్నావో దాని విషయములో నీవే నేరస్థుడవని తీర్పు తీర్చుకొనుచున్నావు; ఏలయనగా తీర్పు తీర్చు నీవును అట్టి కార్యములనే చేయుచున్నావు కావా? అట్టి కార్యములు చేయువారిమీద దేవుని తీర్పు సత్యమును అనుసరించునదే అని యెరుగుదుము. అట్టి కార్యములు చేయువారికి తీర్పు తీర్చుచు వాటినే చేయుచున్న మనుష్యుడా, నీవు దేవుని తీర్పు తప్పించు కొందువని అనుకొందువా?" (రోమా 2:1-3).

అందరికి: "దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు, మొదట యూదునికి గ్రీసు దేశస్థునికి కూడ, శ్రమయు వేదనయు కలుగును. సత్ క్రియ చేయు ప్రతివానికి,

*మొదట యూదునికి గ్రీసు దేశస్థునికిని కూడ, మహిమయు ఘనతయు సమాధానము కలుగును" (రోమా 2:9, 10).*

*"ఏ భేదమును లేదు! అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని కనుపరచవలెనని క్రీస్తుయేసు రక్తమందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను. దేవుడిప్పటికాలమందు తన నీతిని కనపరచు నిమిత్తము, తాను నీతిమంతుడును యేసునందు విశ్వాసముగలవానిని నీతిమంతునిగా తీర్చువాడునై యుండుటకు ఆయన ఆలాగు చేసెను" (రోమా 3:23–26).*

తీర్పు దినమున దేవుడు యిచ్చు బహుమానములను శిక్షలను ఆలోచించిన తరువాత, "దీనంతటిలో దేవుని న్యాయము ఎక్కడ? అని మనం అడుగవచ్చు. భూమిమీద వారి అల్ప జీవితకాలంలో జీవించిన విధానాన్నిబట్టి, నిరంతరము ప్రజలకు బహుమాన మిచ్చుటయో లేక శిక్షించుటయో ఆయనకు న్యాయమేనా? తన దుష్టమైన జీవితాంతంలో ఒకడు మారుమనస్సు పొందితే ఆయన వానికి ఎందుకు బహుమానమివ్వాలి?" లూకా 15లో, తప్పిపోయినవాని అన్న–దుష్టత్వపు జీవితాన్ని జీవించిన తన తమ్ముడు తన తండ్రి దయకు పాత్రుడు కాడని తలంచాడు (25–30 వచనాలు). తాను కోరిన "అల్పమైన వాటికి లోబడకపోయినందున నిరంతరము ఆ వ్యక్తిని శిక్షించడంలో దేవుని న్యాయ మేమి?"

దేవుని ప్రేమ, కనికరము, కృప అనేవాటితో ఉగ్రత, తీక్షణమైన శిక్ష అనేవి ఎలా పొందిక కలిగియుంటాయని అనేకులు ఆశ్చర్యపోతారు. అది వింతగా అనిపించవచ్చు గాని, దేవుని ప్రేమయే ఆయన ఉగ్రతను రేపుతుంది. ఇది విషయాన్ని బహు సూక్ష్మంగా చెప్పినట్టు ఉండవచ్చు. కాని మనం ఎవరిని ప్రేమించామో ఎవరి కొరకు మనం త్యాగం చేశామో వారే మనలను తిరస్కరించినట్టయితే, కోపం రాకుండ ఉండగలమా? దేవుడు రోషముగల దేవుడని పిలువబడ్డాడు.[1] ఆయన ప్రేమయే ఆయన రోషానికి ఆధారం. ఆయన రోషము, ఆయన ఉగ్రతను రేపుతుంది; శిక్షించేలా ఆయనను నడిపించేది ఉగ్రతయే. "యెహోవా రోషముగలవాడై ప్రతీకారము చేయువాడు, యెహోవా ప్రతీకారము చేయును ఆయన మహోగ్రతగలవాడు, యెహోవా తన శత్రువులకు ప్రతీకారము చేయును, తన విరోధులైన వారిమీద కోపముంచుకొనును" (నహూము 1:2).

దేవుడు మనకు తండ్రియైయున్నంత మాత్రాన ఆయన కఠినమైన న్యాయాధిపతి కాకూడదని తీర్మానించకూడదు. లేక క్రీస్తు ప్రభువు గొర్రెపిల్ల అయినంత మాత్రాన ఆయన సింహం కాకూడదని తలంచకూడదు. పరిశుద్ధాత్మను పావురముగా మనం ఆలోచింపవచ్చు, అయితే ఆయన దహించు అగ్ని కాగలడన్న సంగతిని మనం సందేహించకూడదు. క్రీస్తుయేసు ద్వారా నిత్య శిక్షను మనం ఎలా తప్పించుకోగలమో, అట్టి దేవుని ఏర్పాటును తెలియజేసేదే సువార్త లేక "మంచి వార్త."

## పరలోకము, నరకము అనేవి అపాత్రమైనవి కావా?

ఘోరమైన పాపులను రక్షించు దేవుడు న్యాయవంతుడేనా? ఖండితమైన న్యాయమును బట్టి దేవుడు క్రియ చేసినట్టయితే, మనలో ఎవడును రక్షింపబడడు! అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని మనకు తెలుసు (రోమా 3:23; 3:9, 10; 1 యోహాను 1:8, 10లను చూడు). మన పాపములను బట్టి మనమందరము శిక్షకు పాత్రులమే. పరలోకములోని నిత్యజీవానికి మనలో ఎవడును తగినవాడు కాడు. మన రక్షణను మనం ఏర్పాటు చేసికోలేము (ఎఫెసీ. 2:8, 9). ప్రభువైన యేసు ఒక్కడే మనలను రక్షించగలడు (అపొ. 4:12). మన పాపములకు చెల్లింపుగా, దేవుని న్యాయము మరణాన్ని అధికారపూర్వకంగా కోరుతుంది (రోమా 6:23). క్రీస్తు మరణము దేవుని న్యాయమును సంతృప్తిపరచింది (రోమా 3:25; కొలస్సీ 1:19–22). లోకమంతటికి పాపక్షమాపణ లభ్యమయ్యేలా చేసింది (1 యోహాను 2:2). మనలను మన పాపములనుండి విడిపించడం ద్వారా (ప్రకటన 1:5) క్రీస్తు ప్రభువు నిత్య రక్షణను ఏర్పాటు చేశారు (హెబ్రీ. 5:8, 9).

దేవుని న్యాయమును గూర్చిన కొన్ని కఠినమైన ప్రశ్నలకు జవాబులు చూద్దాం:

(1) "ఒక వ్యక్తి తన జీవితమంతయు దుష్టుడుగా ఉండి చివరి గడియలో అతడు ఆయనవైపు తిరిగినట్టయితే, ఆ వ్యక్తిని రక్షించుట దేవునికి న్యాయమా?" ఇలా చేసినట్టయితే, "యెహోవా మార్గము న్యాయము కాదని" మానవుడు కారణమును చెప్పవచ్చును (యెహెజ్కేలు 33:17).

> దుష్టుడు చెడుతనము విడిచి మనస్సు త్రిప్పుకొనిన దినమున తాను చేసియున్న చెడుతనమునుబట్టి వాడు పడిపోడు ... మరియు నిజముగ మరణమునొందుదువని దుర్మార్గునికి నేను సెలవియ్యగా అతడు తన పాపమును విడిచి, నీతి న్యాయములను అనుసరించుచు కుదువ సొమ్మును మరల అప్పగించుచు, తాను దొంగిలిన దానిని మరల ఇచ్చివేసి పాపము జరిగింపకయుండి, జీవాధారములగు కట్టడలను అనుసరించినయెడల అతడు మరణము నొందక అవశ్యముగా బ్రదుకును.
>
> ... మరియు దుర్మార్గుడు తన దుర్మార్గతను విడిచి నీతి న్యాయములను అనుసరించినయెడల వాటినిబట్టి అతడు బ్రదుకును (యెహెజ్కేలు 33:12–19).

దేవుని క్షమాపణకు పౌలును, లూకా 15లోని తప్పిపోయిన కుమారుడును మంచి ఉదాహరణలైయున్నారు. క్షమాపణ మనకు అర్హతలేని బహుమానమైయుంది. అది క్రీస్తు ప్రభువు మరణము మీద ఆధారపడియున్నందునను, మన మంచితనం మీద అది ఆధారపడి ఉండనందునను (ఎఫెసీ. 2:8, 9), తన్ను సేవించిన కాల పరిమితితో నిమిత్తము లేకుండ తన ఇష్టము చొప్పుననే ఎవనికైనా రక్షణ ప్రసాదించడంలో ఆయన న్యాయవంతుడైయున్నాడు.

(2) "ఒక వ్యక్తి తన జీవితకాలమంత నీతిపరుడైయుండి, చివరి కాలంలో పాపిగా మారిపోతే, అతని శిక్షించుటలో దేవుడు న్యాయవంతుడైయుంటాడా?" దేవుడు యెహెజ్కేలుకు యిలా తెలిపాడు,

> నీతిమంతుడు పాపము చేసిన దినమున అదివరకు అతడు అనుసరించిన నీతి అతని

> విడిపింపదు ... ఆలాగుననే నీతిమంతుడు పాపము చేసిన దినమున తన నీతినిబట్టి అతడు బ్రదుక జాలడు. నీతిమంతుడు నిజముగా బ్రదుకునని నేను చెప్పినందున అతడు తన నీతిని ఆధారము చేసికొని పాపము చేసిన యెడల అతని నీతి క్రియలన్నిటిలో ఏదియు జ్ఞాపకమునకు తేబడదు, తాను చేసిన పాపమును బట్టి అతడు మరణము నొందును (యెహెజ్కేలు 33:12, 13).

> నీతిమంతుడు తన నీతిని విడిచి, పాపము చేసిన యెడల ఆ పాపమునుబట్టి అతడు మరణము నొందును (యెహెజ్కేలు 33:18).

ఒక వ్యక్తి పాపమునకు అప్పగించుకొన్నట్టయితే, అతడు దేవుని కృపా ద్వారాన్ని మూసికొన్నాడు. క్రీస్తు రక్తము మాత్రమే పాపక్షమాపణ ప్రసాదిస్తుంది, దేవుని పట్ల మన వ్యక్తిగతమైన స్పందనపై క్షమాపణ ఆధారపడియుంది.

(3) "క్రీస్తు ద్వారా రక్షణ అనే సంగతి తెలిసికొనడానికి ఒకనికి మార్గమే లేకుంటే, అట్టి వ్యక్తిని నిరంతరం శిక్షించడం దేవునికి న్యాయమా?" బైబిలు ఈ ప్రశ్నను ప్రత్యేకించి వివరించకపోయినను, లేఖనాల్లో గుప్తమైనవాటి మీదనే మన తీర్మానాలు ఆధారం చేసికోవచ్చు. ప్రభువైన యేసు యిలా అన్నారు: "నేను ఆయనని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు" (యోహాను 8:24బి). తనను గూర్చి ఎన్నడు విననివారిని యిందులో చేర్చి ఈ ప్రతిపాదనను ఆయన చేశారా? అందరు యిందులో చేర్చబడ్డారు ఎందుకంటె ఆయన లోక రక్షకుడైయున్నాడు (యోహాను 14:6). వ్రాయబడిన దైవ ప్రత్యక్షత అనే ఉపకారం లేకుండ; యేసునందు విశ్వసించే అవకాశము మనుష్యులకు లేనట్టు కన్పిస్తుంది; ఎందుకంటె విశ్వాసము దేవుని వాక్యము ద్వారా వస్తుంది (రోమా 10:17; యోహాను 17:20:21; అపొ. 17:11, 12).

గత యుగంలో, అంటే పాత నిబంధన కాలంలో, ఏ ధర్మశాస్త్రం క్రింద జనులున్నారో వారు దానిని బట్టి తీర్పు పొందుతారు. అన్యజనులకు సంబంధించి, పౌలు యిలా రాశాడు: "ధర్మశాస్త్రము లేక పాపము చేసినవారందరు ధర్మశాస్త్రము లేకయే నశించెదరు; ధర్మశాస్త్రము కలిగినవారై పాపము చేసినవారందరు ధర్మశాస్త్రాను సారముగా తీర్పు నొందుదుర ... ధర్మశాస్త్రములేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేసినయెడల వారు ధర్మశాస్త్రములేనివారైనను, తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు" (రోమా 2:12, 14). దేవుడు లేనట్టు ఒకడు భక్తిహీనమైన జీవితం జీవించినట్టయితే, అతడు నిరుత్తరుడైయుంటాడు, ఎందుకంటె, దేవుని గూర్చి తెలియ శక్యమైనదంతయు అతని యెదుట ప్రదర్శింపబడింది (రోమా 1:18-20). మరియు సహజమైన నైతిక చట్టం ఉంది (రోమా 2:14). ఈ చివరి యుగములో, అంటే, క్రైస్తవ యుగములో, పౌలు యిలా అన్నాడు: "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు" (అపొ. 17:30, 31).

క్రీస్తు ప్రభువు పునరుత్థానం తరువాత, ఆయన తన అపొస్తలులకు గ్రేట్ కమిషన్ యిచ్చియున్నారు; లోకమంతా మిగిలిన కాలమంతటికి అందులో చేర్చబడింది: “మరియు మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి, నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్షవిధింపబడును” (మార్కు 16:15, 16). పౌలు ప్రకారము, దేవుడు రక్షించు శక్తిని సువార్తయందు చూడు:

> సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికిని, గ్రీసు దేశస్థునికిని కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది. ఎందుకనిన – నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడియున్నది (రోమా 1:16–17).

ఈ హేతువుచేత, సువార్తకు లోబడనివారు నశించిపోతారని పౌలు హెచ్చరిక చేశాడు. ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ దిగివచ్చునప్పుడు దేవుని నెరుగనివారికిని మన ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారికిని ప్రతి దండన చేస్తారని వ్రాయబడింది (2 థెస్స. 1:8).

పేతురు యిలా అన్నాడు: “దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించియున్నాను ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువానిని ఆయన అంగీ కరించును” (అపొ. 10:34, 35). అతడు దేవునికి భయపడి మంచి నైతిక జీవితాన్ని జీవించినా (అపొ. 10:1, 2). కొర్నేలి రక్షింపబడవలసిన అవసరముండింది (అపొ. 11:14). దానికి లోబడి క్రైస్తవుడగునట్లు దానిని ప్రకటించడానికి గాను దేవుడు పేతురును అతని యింటికి పంపాడు.

ఈ లేఖన భాగాలన్నిటి వెలుగులో, బాధ్యత నెరిగిన ప్రతివ్యక్తియు సువార్తకు లోబడి దాన్ని అనుసరించాలన్న విషయం స్పష్టంగా ఉంది. ఏ కారణాన్నిబట్టియైనా, అలా జరిగించని ఏ వ్యక్తియైనా, పరిశుద్ధుడును నీతిమంతుడునైన దేవుని చేతిలో ఉన్నాడు. పరలోకమునకు ఈ వైపుననున్న ప్రతి క్రైస్తవుడు నరకానికి ఆవలనున్న ప్రతివ్యక్తికి సువార్తను అందించవలసిన ఆత్మ సంబంధమైన బాధ్యత గలవాడైయున్నది విదితమే. “సువార్త వినియుంటే లోబడియుండేవాడే అనే వ్యక్తికి శిక్షవిధించడం దేవునికి న్యాయమా?” అని ప్రశ్నింపవచ్చు. ఈలాటి ప్రశ్న మనకు అందనిది ఎందుకంటె, అందరి హృదయాలను గాని అందరు పరిస్థితులను గాని మనం సంపూర్ణంగా ఎరుగలేం. దేవుడు మనకును సమస్త మానవాళికిని తీర్పు తీర్చనైయున్నందుకు మనం కృతజ్ఞతను కలిగియుండాలి. మనము తీర్పరులము కాము; మనం తీర్పు తీర్చబడతాం. మనం మన బాధ్యతను జరిగించి, మనుష్యులందరు సువార్తకు లోబడి రక్షింపబడాలని ప్రార్థించుదాం. సమస్త మనుష్యులకు తీర్పుతీర్చడంలో, సర్వలోకమునకు తీర్పు తీర్చువాడు న్యాయముగా తీర్పు తీర్చునని నమ్మిక కలిగియుందాం (ఆది. 18:25).

## నిత్య శిక్ష న్యాయమైనదేనా?

నిత్య శిక్ష న్యాయమైనదని చెప్పడానికి ఎవరి ప్రమాణంతో నిర్ణయించబడుతుంది?

పాపులముగా, పాపము యొక్క బ్రంహాండమైన పొద్దు ఎంతో మనం గ్రహించలేం. పాపమేమైయుందో మనం దాన్ని అలా చూడలేక పోవచ్చు. అందులో మనమే కాదు యితరులకు కూడ ప్రమేయమో ఫలితమో ఉంటుంది, దేవునితో వ్యక్తిగతమైన సంబంధాలు కూడ జతకూడియుంటాయి. పాపముతో మనకున్న సంబంధం దాని భయంకరత్వం ఎంతో గ్రహించకుండేలా చేస్తుంది. పాపము కఠినమైన దండనకు పాత్రమైయుంటుంది. ఎందుకంటె, దాని ద్వారా మనం అపవిత్రులమై పోతాం, దేవుని స్వభావానికి కొద్దివారమై పోతాం (రోమా 3:23). అది మన ప్రమాణం (1 పేతురు 1:15, 16). పాపక్షమాపణలేకుండ, పాపరహితమైన దేవుని పరలోకంలో, మనకోస్థానం ఉండదు (2 పేతురు 3:13; ప్రకటన 21:27).

మనం పాపాన్ని ప్రేమించి అందులో సుఖించవచ్చు, కాని దేవుడు దానిని ద్వేషిస్తాడు (హెబ్రీ. 1:9). దేవుడు పాపాన్ని ద్వేషించి పాపిని ప్రేమిస్తాడని చెప్తుతారు. ఒక విధంగా. యిది నిజమే; కాని దేవుడు పాపిని వాని పాపాన్నుండి వేరుచేయడు. ఆయన అలా చేస్తే, అప్పుడు ఆయన ఉగ్రతగాని శిక్షగాని పాపంమీదనేగాని పాపిమీద ఉండదు. దేవుని ఉగ్రత పాపిమీద కుమ్మరింపబడుతుంది.[2] దేవుడు పాపాన్ని మనం చూచే రూపంలో చూడరు.

ఇది కొన్ని ప్రశ్నలను రేపుతుంది: పాపానికి న్యాయమైన శిక్ష ఏదని తీర్మానించడానికి మనం చాలినవారమా, యోగ్యులమా? పాపం నిజంగా ఏమైయుందో మనం చూడగలమా? దేవుడు చూచినట్టు పాపాన్ని మనం చూడగలమా? పాపానికి న్యాయమైన శిక్ష ఏదో దేవుని దృక్పథాన్ని మనం గ్రహించగలమా? మన ప్రపంచాన్ని దాటి పాపము యొక్క ప్రభావం ఎలాగుంటుందో, దేవునితో అతని సహవాసాన్ని అది ఎలా దెబ్బతీస్తుందో, దేవుని చిత్తానికి తిరుగుబాటు చేయడాన్ని దేవుడు ఎలా భావిస్తాడో మనకు తెలియదు. పాపం యొక్క అత్యాధిక్యతను మనం చూడలేనప్పుడు, న్యాయమైన శిక్ష ఏదో మనం చూడగలమా?

దేవుడు శిక్షను ప్రకటించిన సందర్భాల్లో, పాపము యొక్క అత్యాధిక్యతయు, దేవుని శిక్ష యొక్క కాఠిన్యమును మనం చూడగలుగుతాం. మరణము, కలత, రోగము. హృదయవేదన వంటి అనేక కష్టాలు ఆదాము హవ్వల పాపంవలన మనకు వచ్చాయి. ఒక్క చిన్న, నిర్దోషము అన్నట్టు కన్పించే కార్యాన్నిబట్టి శతాబ్దాల తరబడి కోట్లకొలది జనానికి ఆ క్రియలోని తీవ్రత ఎట్టిదో ఆయన చూపారు. ఇది న్యాయంగా లేదని మనం తలంచవచ్చు కాని దేవుని చిత్తానికి విరోధంగా తిరుగుబాటు యొక్క తీవ్రతను మనం నిర్ణయించలేం. ఆయన మారనివాడు (మాలాకీ 3:6). ఆయన “నిన్న, నేడు, నిరంతరం ఏకరీతిగా నున్నాడు” (హెబ్రీ. 13:8) తన గత తీర్పులకు నిత్య శిక్ష వేరుగా ఉంటుందని తలంచకూడదు.

ఇక్కడ యింత స్వల్పంగా దేవుని చిత్తాన్ని ఉల్లంఘించినందుకు నిత్య శిక్ష న్యాయంగా ఉండదని కొందరు అభిప్రాయపడతారు. మన న్యాయస్థానాల్లో సయితం, ఒక నేరం చేయడానికి పట్టే సమయం శిక్షయొక్క తీవ్రతనుగాని దాని కాలపరిమాణాన్నిగాని తీర్మానించదు. శిక్షను తీర్మానించేది నేరం యొక్క ఘోరత్వం.

నిత్య శిక్షకు సంబంధించి, కొన్ని సంతులను గమనింపవలసి యుంటుంది:

(1) న్యాయాన్ని సంతృప్తిపరచ వెదకేవాని దృష్టిలో అతిక్రమమునకు చెల్లించవలసిన క్రయధనము ఆ నేరమెంత ఘోరమైనదో సూచిస్తుంది. పాప రుణమును చెల్లించడానికి

గాను తన కుమారుని క్రూర సిలువ మరణాన్ని కోరిన దేవుని (1 పేతురు 2:24:; 3:18) కన్నుల యెదుట పాపము ఎంత ఘోరమైనదో సూచింపబడుతుంది. తన విధానంలో న్యాయాన్ని సంతృప్తి పరచుకొనడానికిగాను సిలువ మరణం అనుభవించేలా దేవుడు తన కుమారుని పంపారంటే, దేవుని న్యాయ స్థానంలో నిత్య శిక్ష తప్పక అన్యాయంగా ఉండదు.

(2) తప్పించుకునే మార్గంగా దేవుడు యింత గొప్ప రక్షణను ఏర్పాటుచేయకుంటే, నిత్య శిక్ష అన్యాయంగా గోచరించేది (హెబ్రీ. 2:3). మన రక్షణ కొరకై చేసిన యింతటి ప్రేమపూర్వకమైన బలిని నిరాకరించడం. దేవుని ఉగ్రతను రేపడమే ఔతుంది (యోహాను 3:36).

(3) మనం సంపాదించని, అర్హులముకాని, తప్పించుకునే మార్గాన్ని దేవుడు మనకొరకు ఏర్పాటు చేసినందున, శిక్షను తప్పించుకొంటామో లేదో అనేది పూర్ణంగా మనకే విడిచిపెట్టబడింది. ఇచ్ఛయించువాడు ఎవడైనా జీవజలమును ఉచితముగా త్రాగవచ్చు (ప్రకటన 22:17). నిత్యజీవాన్ని గాని నిత్య శిక్షనుగాని కోరుకునే స్వాతంత్ర్యాన్ని దేవుడు మనకు యిచ్చారు (మత్తయి 7:13, 14; 25:46). మన గమ్యాలు మనం కోరుకునే దానిమీదనే ఆధారపడియుంది. అది దేవునిపై లేదు. మనలో ఎవడును నశింపవలెనని ఆయన కోరలేదు, మనమందరం నిత్యజీవం పొందాలనే ఆయన కోరుతున్నాడు (2 పేతురు 3:9). దేవుడు మన కొరకు నిత్య శిక్షను కోరియున్నట్టయితే, దాన్ని యింకా ఏమి చేయలేము, అప్పుడు ఆయన అన్యాయస్థుడైయుంటాడు. అయితే, మన యిష్టాన్ని కోరుకునే స్వాతంత్ర్యం మనకుంది. యిందులో దేవుని న్యాయం కన్పిస్తుంది.

(4) దేవుడు శిక్షించేవారి హృదయ పరిస్థితిని బట్టి నిత్య శిక్ష యివ్వబడుతుంది. అపవాదికిని వాని దూతలకును, తిరుగుబాటు చేయు, మార్పుపొందనొల్లని హృదయాలు ఉండవచ్చు, అట్టివారికి నిత్య శిక్ష న్యాయమే. నిత్య శిక్షకు వారితో కూడ వెళ్లేవారు (మత్తయి 25:41) సయితం, తమ హృదయాలను కఠినపరచుకొన్నారు. "నీ కాఠిన్యమును మార్పుపొందని నీ హృదయమును అనుసరించి, ఉగ్రత దినమందు, అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చు కొనుచున్నావు" (రోమా 2:5); "ఆ దెబ్బలచేత చావక మిగిలిన జనులు, దయ్య ములకును, ... తమ హస్తకృతములైన విగ్రహములకును పూజింపకుండ విడిచి పెట్టునట్లు మారుమనస్సు పొందలేదు" (ప్రకటన 9:20). ప్రతీకారం చేయడంలో గతమందు దేవుడు ప్రదర్శించిన కార్యములు మారుమనస్సు పొందేలా మనుష్యులను మేల్కొలపాలి. అయితే, అందరును దేవునికి లోబరచుకొనడం లేదు. తప్పిపోయే కొందరిని మారుమనస్సు పొందునట్లు నూతనపరచుట అసాధ్యమని బైబిలు చెప్పుతుంది (హెబ్రీ. 6:6). నరకానికి వెళ్లేవారు తమకు విధింపబడిన శిక్షనుబట్టి దేవుని దూషించుతూ, వారి కఠిన హృదయాలను నిలుపుకుంటారా?

"తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకుంటారా? మనం బైబిల్లో చదువుతాం" (ఫిలిప్పీ. 2:11). అంటే, ప్రతివారు మారుమనస్సు పొందుతారని దీని అర్థమా? "దయ్యములును నమ్మి వణకుచున్నవి" (యాకోబు 2:19). "నీవు దేవుని కుమారుడ"వని అవి ఒప్పుకున్నాయి (మార్కు 3:11; 5:7 కూడ). ఒప్పుకున్నంత మాత్రాన

మారుమనస్సు పొందినట్లేమీ కాదు. అది అలాగైతే, దయ్యాలు ఒప్పుకున్నప్పుడు, అవి కూడ మారుమనస్సు పొందాయని అర్థం. నిజానికి, అవి మారుమనస్సు పొందలేదు.

## శుభవార్త ఏమైనా ఉందా?

మనం దాన్ని అంగీకరించినట్టయితే, నరకయాతనలనుండి క్రీస్తు ద్వారా తప్పించుకొనడానికి దేవుడు సాధ్యం చేశాడనేది ఈ పాఠము యొక్క శుభవార్తయై ఉంది (హెబ్రీ. 5:9). రక్షణ కోరే ఎవడైనా దాన్ని పొందవచ్చు (ప్రకటన 22:17).

ఆయన ప్రేమ, కృప, కనికరములనుబట్టి, మన పాపముల నిమిత్తము మనము బాధపడకూడదని దేవుడు కోరుతూ, మన నిస్సహాయ స్థితిలో మనకు సహాయాన్ని అందించాడు (రోమా 5:6-8). మన పాపముల కొరకు క్రీస్తు మరణించుట ద్వారా, ఆయన దీన్ని జరిగించారు (యోహాను 3:16; రోమా 3:24; 11:32). ఈ శుభవార్తయే సువార్త మన రక్షణలో యిది దేవుని పాత్రయై (భాగమై) యుంది.

సువార్తను నమ్మి లోబడినట్టయితే, ఈ సువార్త యొక్క లాభాన్ని మనం పొందగలం (రోమా 1:16; 2 థెస్స. 1:8; 1 పేతురు 4:17). ఇందులో మన పాపముల విషయమై మారుమనస్సు పొందడం (2 పేతురు 3:9), క్రీస్తునందు మన విశ్వాసాన్ని ఒప్పుకొనడం (రోమా 10:9, 10), మన పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందడం (మార్కు 16:15, 16; అపో. 2:38; 1 పేతురు 3:20, 21) అనేవి చేర్చబడ్డాయి. మనం యిలా చేసినట్టయితే, క్రీస్తు రక్తముచే (కొలస్సీ. 1:19-22; ప్రకటన 1:5) మన పాపాలు కడిగివేయబడతాయి (అపో. 22:16). మన నూతన జన్మనుబట్టిన్నీ, దాని వెంటవచ్చు నూతన జీవితాన్నిబట్టిన్నీ మనము ఆయన యెదుట పరిశుద్ధులము, నిర్దోషులము నిరపరాధులుగా నిలుస్తాం; "పునాది మీద కట్టబడినవారై స్థిరముగ ఉండి ... ఈ సువార్తవలన కలుగు నిరీక్షణనుండి తొలగి పోక, విశ్వాసమందు నిలిచియుండినయెడల ఇది మీకు కలుగును" (కొలస్సీ. 1:22, 23). దేవుడు యిట్టి అవకాశాన్ని దయ చేశాడు. నిత్య శిక్షను తప్పించుకొనడానికి గాను మనము నిత్య జీవాన్ని కోరుకోవాలి.

## ముగింపు

మన న్యాయపు భావాలకు నిత్య శిక్ష అనేది సౌమ్యంగా ఉండకపోవచ్చు, అయితే దేవుడు దానిని గూర్చి మాట యిచ్చాడు, యిది ఆయన స్వాభావానికి అనుగుణ్యంగా ఉంది. ప్రేమగల దేవుడుగా ఆయన కృప ద్వారా - పరలోకంలో నిత్య జీవమును గూర్చిన నిరీక్షణను అయోగ్యులమైన మర్త్యులకు ప్రసాదించాడు. సువార్తకు లోబడి జీవించనైన కోరుకోవచ్చు లేదా సువార్తకు అవిధేయులమై అపవాదితోను వాని దూతలతోను నిత్యత్వమంతా శిక్షింపబడ కోరుకోవచ్చు. దేవుడు మనలను కోరుకుంటున్నాడు, అపవాది కూడ మనలను కోరుకొంటున్నాడు. మనం దేవునిగాని అపవాదినిగాని కోరుకోవచ్చు. మనం కోరుకునేదాని మీదనే మన నిత్యగమ్యం ఆధారపడియుంది.

మరణ ద్వారం మనకు తెరువబడినప్పుడు, లేదా ప్రభువైన యేసే మరల ప్రత్యక్షమైనప్పుడు, దేవుని, నిత్యత్వాన్ని ముఖాముఖిగా ఎదుర్కొంటాం. నీ నిత్య గమ్యం ఏదైయుంటుంది?

సూచనలు

[1]నిర్గమ. 20:5; యెహోషువ 24:19; యెహెజ్కేలు 39:25; 1 కొరింథీ. 10:22. [2]యోహాను 3:36; రోమా 1:18; ఎఫెసీ. 5:6; కొలస్సీ. 3:6; 1 థెస్స. 2:16.